"అయితే నాకేనా లేకపోయేయి. మీరుకూడా కొని తెచ్చుకుంటేగాని నేను వొప్పుకోను"

"అలాగేచూద్దాంలే"

"చూద్దాంకదూ."

---

# * సహగమనం

[మూరేళ్ళ క్రిందట]

♦ 'ఏమిటోయ్! తెగ నవ్వుకుంటున్నావు. కడుపు చేత్తో పట్టుకు నవ్వుకుంటున్నావులే. పక్కలు పీకెట్టేను సుమా. బోర్లా పడి మొహం బద్దలుచేసుకుంటావు!'

'నేనే కాదు ఈకాగితం నువ్వు చదివినా అంతే చేసుకుంటావు'

'ఏమిట్రా కాగితంచూసి నవ్వుకుంటున్నావుట్రా! చాలా తెలివైన వాడివే!'

'నేను చెప్పానుగా ఈ కాగితం నువ్వుచదివినా అంతే చేసుకుంటావని'

'ఏమిటీ, అయితే చదువు చూదాం'

'మొదట నీ కదురు తీసి అవతలపెట్టు. తరవాత దంజాలు వడుక్కుందుగానిలే.'

'అలాగే. నువ్వు చదువుదూ మొదట.'

---

* వీణ మార్చినుండి జూన్ 1938; 'సాహిత్యం' విజ్ఞానదీపిక రజతోత్సవ సంచికలో అచ్చయింది.

♦ మామా అల్లుళ్ళమధ్య సంభాషణ

'కదురుతీసి అవతల పెట్టవయ్యా అంటూవుంటే.'

'ఊఁ. అయితే కాని. (వడకడం మానేస్తాడు.)'

'ఇది అయిదేళ్ళకిందట అంటే క్రీ. శ. 1827 లో పాయిండర్ అనే దొర ముండావాడు ఇండియాహౌసులో సహగమనాన్ని గురించి తీర్మానం తెస్తూ చూపించిన ఒకనిదర్శనం. మహా గమ్మత్తుగా వుందిలే. చదువుతూవుంటే పొట్ట చెక్కలవుతుందన్నమాట.'

'ఏదీ చదువు మరి చూద్దాం'

(చదువును) 'ఇల్లువిడిచి పరదేశానికి వెళ్ళి ఒక బ్రాహ్మడు చనిపోయాడు. ఆయనపేరు సేతు. ఆయన భార్య వయస్సు పధ్నాలుగేళ్ళు. చచ్చిపోయిన పదిహేనురోజులికి ఆమెకి తెలిసింది. ఆమె బంధువులు చితిపేర్చారు' ఇంక యిటుమీద గమ్మత్తుగావుంటుంది! చాలా ఖుషుగ్గావుంటుంది! (చదువును) 'ఆమె చితిపైకిఎక్కి తగలబడవలసివుంది. ఆమె తండ్రిపేరు పుట్నాతివారు. ఆయనకూడా యింటిదగ్గర లేడు. ఆయనకీసంగతి తెలియదు.' పాపం! ముసిలిముండావాడు యింటిదగ్గిరవుండి ఈ శుభకార్యం కళ్ళారా చూచుకునే యోగం లేక పోయింది. అంతా దైవఘటన అయ్యా. లేకపోతే యింతటి శుభ కార్యానికి అతను వుండకపోవడమెలా తటస్థిస్తుంది చెప్పు.'

'అంతా మనవశమా. వాడు యెలానడిపితే అలా నడవాల్సిందే.'

'అదే నేను చెప్పడం. అదిగాక—.'

'చదువు చదువు విందాం.'

'ఊఁ. విను (చదువును) 'కర్మకలాపం ముగిసింది. హుమ్లియా చితి యెక్కింది.' హుమ్లియా అంటే వెధవముండ అన్నమాట.

దీనితల్లి సిగ్గోయ్యో ఎంత తమాషా చేసిందో చూడు. నవ్వలేక కడుపు చెక్కలవుతుంది. (చదువును) 'పినతండ్రి శివలాలు నిప్పంటించాడు. బాధ భరించలేక ఆమె చితినుంచి కిందికి దూకింది' మా తమాషాగా వుందయ్యా! ఇక్కడనుంచే యింక అందుకుంటుంది. (చదువును) 'శివలాలు మరి కొందరు కలిసి ఆమెను కాళ్ళూ చేతులూ కట్టి మళ్ళా మంటలో పారేశారు' మళ్ళా మంటలో పారేశారుటయ్యా! (నవ్వుతాడు)'

'ఊఁ. చదువు'

'(చదువును) 'ఆమె గుడ్డలు పూర్తిగా కాలాయి. వొళ్ళు కొంచెం కాలింది. మళ్ళా ఆమె బయటికి వచ్చింది.' దీనిఅమ్మో సిగ్గోయ్యో! ఇంత కిలాడీ ముండని నేచూడలేదు. లేకపోతే ఇంత అల్లరి చేస్తుందా. అరి దీని తస్సాగోయ్యా! (చదువును) 'దగ్గిర వున్న భావిలోకి వురికింది. ఎంతటిముండో చూశావు? ఇంతకీ అందులో చస్తేయేమిటో ఇందులోచస్తే యేమిటో! దేవుడి ధర్మమా అంటూ ఆ నూతిలో పడి చావలేదు. దేవుడు ధర్మం చూస్తూనే ఉంటాడు. సహగమనం చెయ్యవలసిన ముండను దేవుడు మటుకు మరోలాగు చంపేస్తాడా? కాని ఇంతకీ నీళ్ళులేవు ఆ నూతిలో. అంచేత మళ్ళీ బయటికి ఈడ్చారు, పడ్డని ఈడ్చినట్లు'

'ఏదీ చదువు చూద్దాం'

'(చదువును) 'రూపా అనేవాడు ఇచ్చిన గుడ్డపరిచి దీంట్లో కూచోమని శివలాలు కోరాడు. కాని ఆమె ఒప్పుకోలేదు.' (నవ్వును) అనిమట్టు కేమంత తక్కువ దనుకున్నా వేమిటి? మొత్తంమీద మహా చెడ్డతమాషాగా వుందిలే! (చదువును) 'నేను రాను అనిచెప్పి ఏడ్చింది. ఈడ్చారు. రాలేదు.' అమ్మ దీనిసిగదరగా! ఇంత మొండిముండటయ్యాఇది? ఇంకా చూడు

దీనిఅల్లరి. (చదువును) 'నేను మీ కుటుంబంలో వుండను. ఎక్కడికేనా వెళిపోతాను. మీ దయవుంటే బిచ్చమెత్తుకుని బతుకుతాను అని బతిమాలింది.' (నవ్వు) నిజంగా పాపం! విడిచి పెట్టెయ్యవలసిందే. ఎంచేతంటే, సహగమనం చేసి స్వర్గసౌఖ్యం పొందడంకంటే ముష్టియెత్తుకోడం గౌరవం కాదూ మరి! అంచేత అప్పుడు శివలాలుగారు ఏంచేశారంటే (చదువును) 'అమ్మా! ఈబట్టలో కూచో నిన్ను ఇంటికి తీసుకుపోతానని శివలాలు గారు గంగానది పేరుచెప్పి ఒట్టుపెట్టుకున్నాడు.' శ్రీహరీ! ఆ పాడుముండవల్లగదా పాపం ఆ మహానుభావుడు ఇంత ఘోర మయిన ప్రమాణం చెయ్యవలసివచ్చింది. ఆహా! దాన్ని ఇంతేసి ముక్కలకింద నరికినా పాపంలేదు. ఆపళంగా పచ్చడికింద తన్నేసెయ్యవలసింది. నేనుంటే అంతేచేతును. ఇంక చదువుతా విను. (చదువును) 'హుమ్లియా బట్టలోకూచుంది. ఆమెను దానిలో వేసికట్టి వెదురుబొంగు తగిల్చి చితిదగ్గిరికి తీసుకు వచ్చారు' (పకపకానవ్వు) నేనిది యింక చదవలేనయ్యా! నాకు ఓపిక లేదు బాబూ నవ్వడానికి. పక్కలు పీకెడుతున్నాయి. నువ్వు చదువుకుంటే చదువుకో, లేకపోతే మానెయ్యి.'

'మహాతమాషాగా వుంది చదువురా!'

'నేను చదవలేను బాబూ! నాకుపక్కలు పీకెడుతున్నాయి. కావలిస్తే నువ్వు చదువుకో'

'నాకు అచ్చుచూసి చదవడం అలవాటులేదురా. తాటాకు మీదీ అక్షరాలేగాని అచ్చక్షరాలు కంటికి ఆనవు. జోడెట్టు కున్నానసరే'

'సరి అయితే నీకోసమని చదువుతున్నా విను—(చదువును) మంట భగభగ మండుతూంది. దాంట్లో వడేశారు! పైన

చుట్టినబట్ట క్షణంలో కాలిపోయింది. ఆ దురదృష్టవంతురాలు ప్రాణం రక్షించుకోడానికి మళ్ళా ప్రయత్నించింది' (నవ్వి, ఒక్కమాటుగా ఆగి) ఆఁ! దురదృష్టవంతురా లంటాడేమిటీ వీడి పిండాకూడు?'

'తెలియనివాళ్ళకి అలాగే వుంటుందిలే.'

'ఆ అదృష్టం పదివేలయేళ్ళు తపస్సు చేస్తేమాత్రం ముగాళ్ళకి వస్తుందిటయ్యా! ఈ సంగతి వాడికేం తెలుసు! వాడి మొహంలాగవుంది. ఇంక యివ్వాళు మరీ తమాషాగా వుంటుందయ్యా! (చదువును) 'కాని శివలాలూ, తక్కిన బంధువులూ కలిసి కోరగా బుర్రై అనే ఒక మహమ్మదీయుడు కత్తితో ఆమె గొంతుక నరికాడు.' మంచిపని చేశాడు నాకు నచ్చిన పని చేశాడు. మెచ్చుకోతగిన పనిచేశాడు పాపం! తురకవాడయితే అయాడుగాని ఉపకార బుద్ధివున్నవాడు ఆరి! దాని తస్సాగొయ్యా, ఎంతబాధపెట్టిందయ్యా. ఎలాగయితే శివలాలు బాధ విరగడయింది. ఆ బ్రాహ్మణ్ణి ఇంతబాధ పెట్టినందుకు ఈ ముండ నరకంలో ఎన్నిబాధలు పడుతుందో? ఏదయితేయేం పీడవదిలిందిలే. ఇంక చదువుతా విను(చదువును) 'హతురాలికు అన్ని బాధలూ వదిలిపోయాయి. ఈ దొంగాడు మళ్ళా ఏమి రాస్తున్నాడో చూడు. వీడు పక్షపాతంగా రాస్తున్నాడయ్యా. శివలాలుకు అన్ని బాధలూ తీరిపోయాయి అని రాయడానికి బదులు దానికి - అంటే ఆ దొంగముండకు అన్ని బాధలూ వదిలిపోయాయి అంటున్నాడు. వీడి తెలివితేటలు కాలినట్టే వున్నాయి.'

'మన సాంప్రదాయాలు తెలియనివాళ్లు పాలనచేస్తే ఇలాగే వుంటుంది అబ్బాయి.'

'ఇంకా చదువుతా విను. (చదువును) 'హాబ్లియా వెలి కిలబడి కాలిపోయింది.' మంచిపని చేసింది ముండ. రక్షించింది. (పకపకనవ్వుతాడు) అది పారిపోడానికి చేసిన ప్రయత్నం తలు చుకొంటూ వుంటే నాకు పొట్టచెక్కలవుతూందయ్యా. మొత్తా నికి అంతా మహా గమ్మత్తుగా వుందలే.'

'ఓస్ ఇంతే కద్రటా. ఇంత కంటే అల్లరి చేసిన ముండల్ని చూశాను. మొగాళ్ళనుగూడా చితిలోకి లాగిన ముండల్ని నేను చూశాను.'

'నాకు అదే జ్ఞాపకమొస్తూవుంటే నవ్వొస్తుందయ్యా. ఔనుగాని మామా! మరి ఆడదాన్ని పాడెతో కట్టి చితి మీద పెట్టి మంగవేసి ఆపళంగా వెదుళ్ళతో నొక్కుతారు గదా. ఈ ముండను మరి ఆలా విడిచి పెట్టారేమి?'

'మరి ఆదేశంలో నువ్వు చెప్పినట్టు గానే చేస్తారురా. ఎంచేత వాళ్లు దాన్ని అలాగ చెయ్యలేదో నాకు తెలియదు. చెయ్యక పోడంవల్లే చూశావా యెంత తమాషా జరిగిందో!'

'కాని అప్పుడు బాజాలు ఘట్టిగా వాయిస్తారెందు కయ్యా.'

'ఒక వేళ కాలుతూన్న మనిషి పెద్దపెద్ద కేకలు వేస్తుం దనుకో, అది అసహ్యంగా వుంటుంది వినే వాళ్ళకు. అందుకూ ఆ మోస్తరుగా గట్టిగా వాయించడం.'

'అవును గాని ఈ సహగమనం జాతి వాళ్ళు మానెయ్య మంటే మన వాళ్లు మానెయ్యడ మేమిటయా. నాకు చాలా చాలా విచారంగా వుంటుంది సుమా! మన వాళ్ల కేమయినా వివేక ముండాలా వద్దా. ఇంతకి జాతివాళ్లెవరూ మానెయ్య మనడానికి?'

'జాతివాళ్లెవరూ ఏమీ అనలేదురా. మన వాళ్ళకి పుట్టిన

బుద్ధే ఇది.'

'అవునయ్యోయ్! జ్ఞాపకమొచ్చింది. ఎవడో రామమోహన్‌రాయిట. ఆ రాయి రప్పగాడు యెలా మానిపించాడయా?'

'ఎలాగో జాతివాళ్ళను పురికొల్పాడు మీరీ ఉపకారం చేసి తీరాలన్నాడు. మీ అంతటి వాళ్ళు లోకంలో లేరన్నాడు. దానితో వాళ్ళుబ్బి తబ్బిబ్బయి మూడేళ్ళకిందట ఒక చట్టం యేర్పరిచారు. ఆ చట్టంతో యిప్పుడు సహగమనాలు చెయ్యడం నేరమయి పోయింది.

'ఈ రామమోహన్ రాయి ఏమని వాదించాడేమిటి?'

'వాడిదంతా ఓ విచిత్ర వాదన. మనుస్మృతిలో సహగమనము చెప్పలేదు. తక్కిన స్మృతులలో మాత్రమే చెప్పబడి వుంది. ఈ కాలంలో మనకి మనుస్మృతే కదా ప్రమాణం అన్నాడు. ఇంతకీ సహగమనం వొక దుర్మార్గంట; క్రూరమైన కార్యంట. అసలు మన వేదాంతానికి వ్యతిరేకంట! స్వర్గానుభవం కోసం కదా మీరు సతి చేయిస్తున్నారు. నిష్కామకర్మ ఉత్తమమైనదని వేదాలూ, ఉపనిషత్తులూ చెప్తూంటే మీరు స్వర్గసౌఖ్యంకోసమని అది జరపడం తప్పుకాదా అని అడిగాడు.'

'అంటేమన వాళ్లు యేమన్నారు.'

'ఏమన్నారు, నీది ఉత్త కొంటివాదన అన్నారు. శాస్త్రాల ప్రకారం సహగమనం కూడకపోతే ఆచారం ప్రకారం కూడుతుందన్నారు.'

'అంటే వాడు?'

'ఆచారమైతే క్రూరమైన ఆచారం అంచేత కూడదన్నాడు.'

'వీడు మహా ఘట్టివాడులాగున్నాడే, మన వేలితో మన

కన్నే పొడుస్తున్నాడు. అతనన్నాడని ఆపళంగా వూరుకున్నా రేమిటి మన వాళ్లంతా ?'

'మనవాళ్ళు దద్దమ్మలట్రా వూరుకోడానికి. ఆ పళంగా వూరువూరా సభలు జరిపారు. మహాజర్లు పెట్టారు. గొప్ప గొప్ప పండితులంతా వెళ్ళి గవర్నరుజనరలుగారికి 'అయ్యా మీరు చేస్తున్నపని చాలాచెడ్డది; హిందూమత నాశనకరమైన దని, బోధ పరిచారు. అంతకంటె ఎవరు మటుకు ఏమిటి చేస్తారురా. మరి కొందరు ఆ తరువాత ఏమయినా సరే జరిపించి తీరుతామని సహగమనాలు జరిపించి జయిళ్ళకు వెళ్ళి కూర్చు న్నారు. ఇంతకంటె ఏంచెయ్యగలరురా ఎవరుమటుకు.'

'మరి మొన్న ఏదో పార్లమెంటుకు ... '

'అది ఈయేడే జరిగింది. పార్లమెంటుకు మన వాళ్ళు వెళ్ళి ఆ దుర్మార్గపుచట్టాన్ని రద్దుపరచమని మొరపెట్టారు. కాని వీళ్ళ మొరవిన్నవాళ్ళెవరూ! పోస్ పొమ్మన్నారు వాళ్ళు ఆపళంగా తిరిగివచ్చేశారు.'

'ఆరి వీళ్ళతస్సాగొయ్యా. ఎంతపనిచేశారయ్యా. ఇదిగో ఇంతటితో యిది పోతుందనుకున్నావు కామోసు. ఎన్నటికీ అనుకోకు. వెనక అక్బరుగారు కూడా యిలాంటిపనే చేశారుట. కాని పోయిందా ? ఇప్పటికీ అంతేననుకో.'

'అది కాదురా. ఇది యిప్పుడు జాతివాళ్ళుచేసిన పని కాదురా, వాళ్ళచెయ్యి పట్టుకుని మనవాళ్లు చేయించినపనేరా యిది.'

'అంటే జాతివాళ్ల ప్రభుత్వంపోయాక తిరిగి వస్తుందంటావు.'

'ఏమిట్రా నామాట వినిపించుకోవు. ఇది మనవాళ్లుచేసిన పనేరా అంటూవుంటే. జాతివాళ్ళు పోయేది, దేవుడు పోయేది.

ఇది తిరిగివచ్చేసూచనలు లేవు. మనలో మనవాళ్లు ఏర్పాటు చేసుకున్న చట్టమేరా ఇది. ఎవరుపోయినా సరే యిదిపోదు.'

'హిందువులికి వినాశకాలం వచ్చిందయ్యా. మతగౌరవం తగలడిపోయేరోజులు వచ్చాయి. బ్రాహ్మణ్యం చెడిపోతోంది. ఇదంతా కలికాలమహిమ. ఇంకా ముందు ముందు ఎటువంటివి వస్తాయో ఏమిటో!'

'మనవాళ్లు పూర్వాచారులు అయేవరకూ ఇటువంటివి తప్పవనుకో! పూర్వాచారమనేది ఒకటే ఇటువంటివాటి కన్నిటికీ దివ్యౌషధం.'

'మరే.'

---

# నందన కరువు

[ నూకళ్ళ కిండట ]

సుబ్బయ్య: నందనసంవత్సరం కరువుకాలందాటి మనం బతుకుతాం అనుకోలేదురా రాముడూ!

రామశాస్త్రి: ఏదో నాలుగురోజుల కోకపూట పిడికెడు మెతుకులు తిని బతికేం.

వెంకటశాస్త్రి: తిండి నాలుగురోజుల కోకపూట దొరికినా ఎక్కడపడితే అక్కడ మంచినీళ్లు దొరికినా బాగుండును. మంచి నీళ్ళేమిటి నీళ్ళంటూ దొరికినా బాగుండేది.

సు: నీళ్ళుదొరికితే ఇంక కరువేమిట్రా.

రా: కృష్ణ మొదలు నెల్లూరువరకూ ఒక్కచుక్క లేదంటే నమ్ము.